# ఏ దేశానిది ఏ నేపథ్యం?

**వివిధ సంఘటనలు జరిగినపుడు వార్తల్లో తరచూ కొన్ని దేశాల ప్రస్తావనలు కనపడుతుంటాయి. ఆ నిర్దిష్ట పరిణామాల పూర్వరంగం గురించి తెలిసివుంటేనే ఆ సంఘటనలు సుస్పష్టమవుతాయి. అందుకే వివిధ దేశాల నేపథ్యాలను క్లుప్తంగానైనా గ్రహించటం పోటీ పరీక్షల విద్యార్థులకు అవసరం!**



విజయ శేఖర్

ఐరోపాలో 'బెనెలక్స్' అని పిలిచే మూడు చిన్నదేశాల బృందం ఉంది. బెల్జియం, నెదర్లాండ్స్ (హాలండ్), లక్జెంబర్గ్ దేశాల మొదటి అక్షరాలను చేర్చి అలా పిలుస్తారు. 1940ల్లో ఈ మూడూ కలసి ఒక యూనియన్‌గా ఏర్పడ్డాయి. యూనియన్‌కి బెల్జియం రాజధాని బ్రసేల్స్ కేంద్రం. సొంత అస్తిత్వం కొనసాగిస్తూనే ఉమ్మడి రాజకీయ (పార్లమెంటు), ఆర్థిక, వాణిజ్య (బెనెలక్స్ యూనియన్), న్యాయ (కోర్టు) సంస్థలను ఏర్పరచుకున్నాయి.

పశ్చిమ జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీలతో కలిసి బెనెలక్స్ యూనియన్ ఏర్పాటు చేసిన 'యూరోపియన్ కోల్ అండ్ స్టీల్ కమ్యూనిటీ'యే అనంతరకాలంలో మరిన్ని దేశాలను కలుపుకుని 'యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీ'గా, తర్వాత 'యూరోపియన్ యూనియన్' (ఈయూ)గా ఏర్పడ్డాయి. ఇపుడు ఈయూ కేంద్ర సంస్థలన్నీ బ్రసెల్స్ కేంద్రంగానే పని చేస్తున్నాయి. ఈయూ సమావేశాలు ప్రధానంగా బ్రసేల్స్‌లోనే జరుగుతాయి.

బ్రసేల్స్ సమావేశాలు అని ఎక్కడైనా తగిలితే ఈయూ లేదా సంబంధిత సమావేశాలు జరుగుతున్నాయని భావించవచ్చు.

## ఈ దేశాలకో ప్రత్యేకత

తూర్పు ఐరోపా దేశాలైన పోలండ్, రుమేనియా, హంగేరి, చెక్+స్లోవేకియా, బల్గేరియా తదితర దేశాలకు ఒక ప్రత్యేకత ఉంది. ఇవి ఒకప్పుడు కమ్యూనిస్టు రాజ్యాలు. పొరుగునే ఉన్న రష్యా ప్రభావంతో కమ్యూనిజాన్ని స్వీకరించిన ఈ దేశాలు 1960ల నుంచి మళ్లీ రష్యా ప్రభావంతోనే పెట్టుబడిదారీ విధానం వైపుకు మళ్లాయి. 1990ల తర్వాత ఐరోపాలో సంలీనం కావడానికి తంటాలు పడుతున్నాయి. ఐరోపా ఖండానికి ఉన్న ఆధునిక ముద్ర వీరికి కావాలి. అదే సమయంలో పెట్టుబడిదారీ పరివర్తన రుద్దిన పేదరికాన్ని అభివృద్ధి చెందిన పశ్చిమ ఐరోపా తనకు కంటకంగా భావిస్తోంది.

## ఆసియానా? ఐరోపానా?

ఆసియా, ఐరోపాలలో ఏ ఖండానికి చెందుతాయో తెలియని సందిగ్ధత ఉన్న దేశాలు కొన్ని ఉన్నాయి. టర్కీ, రష్యాల మెజారిటీ భూభాగం ఆసియాలో ఉంటే అక్కడి ప్రజలు మాత్రం తమను తాము యూరోపియన్లుగా చెప్పుకోవడానికే ఎక్కువగా ఇష్టపడతారు. టర్కీలో కొందరు ఆసియన్లుగా చెప్పుకునేవారు ఉన్నప్పటికీ పాలకవర్గాలు ఐరోపావైపు మొగ్గు చూపుతాయి.

**జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై అవగాహన సాధించడమెలా? 11**

అమెరికా నేతృత్వంలోని నాటో కూటమిలో ఉన్న ఏకైక 'ఆసియా రాజ్యం'గా టర్కీని చెప్పేవారు ఉన్నారు. జార్జియా, అజర్ బైజాన్, ఆర్మీనియాలు కూడా ఐరోపా - ఆసియా సందిగ్ధతలో ఉంటుంటాయి. వీటిని ఆసియా, ఐరోపా రెండింటికీ చెందినవిగా ఇంకొందరు చెబుతారు. ఆసియా, ఐరోపాల విభజనపై స్పష్టత లేకపోవడం ఈ సందిగ్ధతకు మూలం. రెండు ఖండాలను కలిపి 'యూరేసియా'గా ఇప్పుడు వాడుకలోకి వస్తోంది.

ఆసియా, ఐరోపా సరిహద్దులో స్కాండినేవియన్ దేశాలకు సమీపంలో మూడు బుజ్జి రిపబ్లిక్కులు ఉన్నాయి. అవి: లాత్వియా, లిథుయేనియా, ఎస్తోనియా. జాతుల సమస్యకు సోషలిస్టు రష్యా నేత లెనిన్ చూపిన రక్తపాత రహిత పరిష్కారానికి గుర్తుగా నిలిచే ఈ మూడు దేశాలను 'బాల్టిక్ రిపబ్లిక్కులు' అని కూడా అంటారు.




జాతులు స్వతంత్ర దేశాలుగా విడిపోయే హక్కును మొట్టమొదట గుర్తించింది లెనిన్ నేతృత్వంలోని సోవియట్ రష్యాయే. సోవియట్ రష్యా రాజ్యాంగం ప్రసాదించిన హక్కును వినియోగించుకుని స్వతంత్ర రాజ్యాలుగా అవతరించిన ఈ రాజ్యాలు తమకు సోవియట్ రష్యాలోనే భద్రత, తగిన గుర్తింపు, అభివృద్ధి సాధ్యమని గుర్తించి తిరిగి అందులో చేరిపోయాయి. విడిపోవడానికి కొట్లాడిన దేశాలు విడిపోయాక మళ్లీ కలిసిపోవడం చరిత్రలో బహుశా అదే మొదటిసారి, ఇప్పటివరకు చివరిసారి కూడా. 1990లో సోవియట్ రష్యా విచ్ఛిన్నం దరిమిలా ఇవి మళ్లీ స్వతంత్ర రిపబ్లిక్కులుగా అవతరించాయి.

## ఘర్షణల నిలయం... మధ్యప్రాచ్యం

తూర్పు ఐరోపా దాటి తూర్పుకి వస్తే అది ఆసియాకి పశ్చిమం. నిత్యం పెనం మీద ఉన్నట్లు కాలిపోతుండే మధ్య ప్రాచ్యం ఉన్నది ఇక్కడే. దీనిని పశ్చిమాసియా (ఈజిప్టు మినహా) అని కూడా పిలుస్తారు. చుట్టూ భూభాగం చుట్టివున్న మధ్యధరా సముద్రం అనేక ఘర్షణలకు నిలయం.

మధ్యప్రాచ్యంలో అరబ్బు దేశాల మధ్య ఉన్న ఇజ్రాయెల్ పశ్చిమదేశాల తురుపుముక్క. అవడానికి తురుపుముక్కే అయినా ఇజ్రాయెల్ దేశమే ఒక్కోసారి పశ్చిమ రాజ్యాలను, ముఖ్యంగా అమెరికాను ఆడిస్తున్నట్లు కనిపిస్తుంది. ఇజ్రాయెల్- అమెరికా సంబంధాల గురించి చెప్పేటప్పుడు అప్పుడప్పుడూ పత్రికలు 'శరీరం తోకను ఆడిస్తోందా లేక తోక శరీరాన్ని ఆడిస్తోందా' అని వ్యాఖ్యానించడం అందుకే.

అమెరికాలో యూదులు సకల అధికార వ్యవస్థల్లోకి చొరబడి అక్కడి పాలనా వ్యవస్థను శాసిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అమెరికా సాగించే ప్రపంచాధిపత్య కుట్రలలో ఇజ్రాయెల్‌కి ఏదో రూపంలో భాగస్వామ్యం ఉంటుందని ప్రతీతి.

### మూడు జడకుచ్చులు





ఐరోపాపైన ప్రత్యేకంగా కనపడే ఐదు దేశాలు స్కాండినేవియన్ దేశాలు. ఇందులో నార్వే, స్వీడన్, ఫిన్లాండ్ దేశాలు మూడు జడకుచ్చుల్లాగా ఒక కొక్కేనికి వేళ్లాడుతున్నట్లు ఉంటాయి. మూడు దేశాల కింద ప్రధాన ఐరోపా భూభాగానికి దగ్గర్లో డెన్మార్క్ ఉంటే, వాయవ్య దిక్కులో ఐస్‌లాండ్ ఐదో స్కాండినేవియన్ దేశం. ఈ ఐదు దేశాలు భాష, సంస్కృతి, వాతావరణ అంశాల పరంగా దగ్గరి పోలికలతో ఉంటాయి.

తగాదా పడుతున్న దేశాలు శాంతి చర్చలు జరుపుతున్నా, రాజీ చర్చలు జరుపుతున్నా దానికి నార్వే మధ్యవర్తిత్వం వహించడం కద్దు. శ్రీలంక-ఎల్.టి.టి.ఇ., ఇజ్రాయెల్-పి.ఎల్.ఒ., బోస్నియా సివిల్ వార్, సూడాన్- దక్షిణ సూడాన్, ఎరిత్రియా-ఇథియోపియా తదితర అంతర్జాతీయ వివాదాల్లో నార్వే మధ్యవర్తిత్వం వహించింది. ఆ క్రమంలో పి.ఎల్.ఒ., ఎరిత్రియాల పక్షం వహించిందని ఇజ్రాయెల్, ఇథియోపియాల ఆరోపణలను ఎదుర్కొంది కూడా.

### ప్రశ్నార్థకం పాలస్తీనా

మధ్య ప్రాచ్యంలో ప్రత్యేకంగా చెప్పుకోవలసిన ప్రాంతం పాలస్తీనా. పశ్చిమదేశాలు సాధించాయంటున్న అభివృద్ధి ముఖంపై ఇది అతిపెద్ద ప్రశ్నార్థక చిహ్నం. పశ్చిమదేశాల ప్రజాస్వామిక ముసుగును నిట్టనిలువున చీరేసే నెత్తుటి మరక. పశ్చిమ దేశాలు వల్లించే 'స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాత్రం' విలువల బూటకత్వాన్ని గేలిచేస్తూ నిత్యం ఇనపబూట్లు నర్తించే నేల. మానవసమాజం సాధించిన నాగరికత నడిబొడ్డున రక్తం ఓడుతున్న గాయం పాలస్తీనా!

హిట్లర్ జాత్యహంకార అణచివేతను సాకుగా చూపి యూదుజాతికి నష్టపరిహారంగా పాలస్తీనీయులను తరిమివేసి ఏర్పరిచిన ఇజ్రాయెల్ రాజ్యం, పాలస్తీనా అరబ్బులపైన జాత్యహంకార పాలన అమలు చేస్తోంది. నీరు, నేల,



నింగి, పని, బాల్య కౌమార వృద్ధాప్యాలు... ఒకటేమిటి, పాలస్తీనీయుల సమస్తాన్ని లాగేసుకుంటోంది ఇజ్రాయెల్. పాలస్తీనాలో ఒక భాగమైన 'గాజా'ను ప్రపంచంలో అతిపెద్ద బహిరంగ (ఓపెన్ ఎయిర్) జైలుగా ఇజ్రాయెల్ మార్చేసింది. మరో పాలస్తీనా ప్రాంతం వెస్ట్ బ్యాంక్‌లో మరింతమంది పాలస్తీనీయులను తరిమివేస్తూ ఐరాస తీర్మానాలను ధిక్కరించి, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా మరిన్ని సెటిల్‌మెంట్లను నిర్మిస్తోంది ఇజ్రాయెల్. మధ్యప్రాచ్యంలో అమెరికా పన్నే జియో పొలిటికల్ వ్యూహాల్లో ఈ అక్రమ సెటిల్మెంట్లు ఒక భాగం.

*రచయిత జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సైట్ http://teluguvartalu.com నిర్వాహకులు.*